నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్‌ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సింగపూర్‌ టౌన్‌షిప్‌లోని డీ2, డీ3, డీ4, సీ1, సీ2, సీ3, ఏ24 నుంచి ఏ35 బ్లాకుల వరకు విద్యుత్‌ ఉండదన్నారు. మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు ఇన్ఫోసిస్‌ హాస్టల్‌, పోచారం గ్రామం, అన్నానగర్‌, నాగారం పరిధిలోని డబుల్‌ బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



శామీర్‌పేట్‌: మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌ గ్రామంలో గురువారం కాంగ్రెస్‌ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కటికెల గోపి, మండల పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగన్నాథం ఆధ్వర్యంలో గ్రామంలోని చౌరస్తా వద్ద సీఎం చిత్రపటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు రవి, లక్ష్మణ్‌, వీరేశం, గ్రామ పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి.. అసౌకర్యాల ఒడి!

- కేంద్రాల్లో కానరాని కనీస వసతులు
- సొంత భవనాలు, ఆటస్థలాలు లేవు
- ఆరుబయటే పోషకాహారం
- గర్భిణులు, బాలింతలకు తప్పని ఇబ్బందులు
- మరుగుదొడ్లు లేని కేంద్రాలే అధికం

జవహర్‌నగర్‌: పుట్టిన బిడ్డల ఎదుగుదలకు దోహదపడేలా చిన్నతనం నుంచి పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల వాతావరణాన్ని అలవాటు చేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను తీసుకొచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో భాగంగా పిల్లలకు అందించాల్సిన విద్య, వారిలో సృజనాత్మకత పెంపొందించాల్సిన అంశాలపై ఒక ప్రణాళికను సైతం రూపొందించింది. దీనిలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్‌) ప్రవేశపెట్టింది. తద్వారా పిల్లలకు ఆట పాటలతో జ్ఞాన సంపద, తెలివితేటలను పెంచాలని ప్రభుత్వం లక్ష్య నిర్దేశం చేసింది. అయితే సంబంధిత కేంద్రాల పని తీరు విషయంలో అధికారుల క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నామమాత్రంగానే ఉందని చెప్పొచ్చు.

- ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌(అల్వాల్‌) జోన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దాదాపు 22 మంది పైగా టీచర్లతో పాటు 22 మంది కార్యకర్త(ఆయా)లుగా ఇక్కడ పనిచేస్తున్నారు.
- అంగన్‌వాడీ భవనాలకు సొంతగూడు లేక కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 18 కేంద్రాలకు అరకొరగా భవనాలు నిర్మించారు.
- నాలుగు (శివాజీనగర్‌, శ్రీరాంనగర్‌, ఫైరింగ్‌ కట్ట, చంద్రపురికాలనీ) కేంద్రాలకు భవన సదుపాయంలేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చాలీచాలని గదుల్లో కూర్చోలేక ఆరుబయటే ఉంటున్నారు. చిన్నారులకు ఆట స్థలం కరువైంది. పౌష్టికాహారం సైతం ఆరుబయటే అందిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు అద్దెగృహాల్లో వర్షపునీరు కారుతోంది.
- దీంతో సరుకులు, రికార్డులను భద్రపరిచేందుకు నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా సెంటర్లలో మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చంద్రపురికాలనీలో ఇరుకైన అద్దె గదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పూర్ణిమ...

కీసర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు సక్రమంగా అందజేయాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ అన్నారు. శుక్రవారం రాంపల్లిదాయర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, ప్రభుత్వ పాఠశాలను ఆమె ఎంపీడీఓ గ్యామతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలతో స్టాక్‌ రిజిస్టార్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్తోపాటు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. జాఫర్‌గూడలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌ చక్కగా కిచెన్‌షెడ్‌ను నిర్వహిస్తుండటం పట్ల అధికారులను ఆమె అభినందించారు. పాలకూర, తోటకూర తదితర పోషకాహార పంటలను అంగన్‌వాడీ కేంద్రంలోనే పండించి విద్యార్థులకు వడ్డించడంతోపాటు, గర్భిణులకు పంపిణీ చేయడం చేస్తున్నామని అంగన్‌వాడీ టీచర్‌ అధికారులకు తెలిపారు.

సొంత డబ్బుతో నిర్మిస్తా...



26వ డివిజన్‌లో అంగన్‌వాడీ సెంటర్‌ను స్థలం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా అధికారులు స్థల కేటాయింపుపై శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే తన సొంత డబ్బులతో చిన్నారులకు పార్కు, ఆట వస్తువులతో పాటు నూతన భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మిస్తా.

– పానుగంటి బాబు, 26వ డివిజన్‌ కార్పొరేటర్‌

చిన్న చూపు తగదు



ప్రత్యేక రాష్ట్రంలోనూ ప్రైవేట్‌ పాఠశాలకు ప్రాధాన్యతన ఇవ్వడం విడ్డూరంగా ఉంది. చాలా అంగన్‌వాడీ కేంద్రాలు గాలి, నీరు, వెలుతురు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన భవనాలు నిర్మించి ఆట స్థలాలను కేటాయించాలి.

– మాధవి, చంద్రపురికాలనీ

మెరుగైన వసతులు కల్పిస్తాం



ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తాం. జవహర్‌నగర్‌లో అద్దెగదుల్లో నడుస్తున్న అంగన్‌వాడీలతోపాటు సబ్‌సెంటర్లకు స్థలాలను గుర్తించాం. గత కౌన్సిల్‌లో తీర్మానం చేసి కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించాం.

– దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్‌, జవహర్‌నగర్‌ మేయర్‌

పరిసరాల పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ప్రణీతాగౌడ్‌ తదితరులు

కీసర: ప్రజలు తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరకుండా పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండొచ్చని దమ్మాయిగూడ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ప్రణీతాగౌడ్‌ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్‌ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకేకాలనీ 1వ వార్డులో కమిషనర్‌ రాజమల్లయ్య, స్థానిక కౌన్సిలర్‌ నానునాయక్‌, ఆర్‌జీకే బస్తీ దవాఖానా వైద్యురాలు అలేఖ్య, ఏఎన్‌ఎం విజయరాణి తదితరులతో కలిసి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగాంగా ఆర్‌జీకే కాలనీలో సుమారు 500 మొక్కలను నాటారు. సుమారు 1153 పండ్ల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ సమస్యలపై ఎంపీకి వినతి

కీసర: మేడ్చల్‌-మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను శుక్రవారం మేడ్చల్‌ జిల్లా బీజేపీ అధికార ప్రతనిధి గాలి సంపత్‌యాదవ్‌ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఎంపీకి విన్నవించారు. మున్సిపాలిటీలో శ్మశాన వాటిక సమస్యతోపాటు భవానీనగర్‌లోని డ్రైనేజీ సమస్య, సైలెంట్‌ ఎన్‌క్లేవ్‌లో రోడ్డు సమస్య, ప్రగతి నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను, జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రగతినగర్‌ కాలనీలో 800 గజాల స్కూల్‌ స్థలం అన్యాక్రాంతం అవుతోందని సదరు స్థలాన్ని పరిరక్షించి ప్రభుత్వహెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ ఈటల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా విషయాలపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు సంపత్‌యాదవ్‌ తెలిపారు.

నియామకం



నవీన్‌రెడ్డి

మేడ్చల్‌: రాష్ట్రంలో బేవరేజెస్‌ కార్పొరేషన్‌ ద్వారా మద్యం కొనుగోలు ధరలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో మేడ్చల్‌కు చెందిన చార్టర్డ్‌ అకౌంటెంట్‌కు చోటు లభించింది. మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌కు చెందిన నవీన్‌రెడ్డికి కమిటీలో స్థానం కలిపించారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి కిషోర్‌జైస్వాల్‌, విశ్రాంత ఐఏఎస్‌ శ్రీనివాసరాజులతో పాటు నవీన్‌రెడ్డి సభ్యుడిగా నియమితులయ్యారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

పోచారం: కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ రాజు సమాచారం మేరకు... మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు ఉదేశ్‌ రాజ్‌ భోషం (29) జోడిమెట్ల చౌరస్తా వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా ఉప్పల్‌ నుంచి బీబీనగర్‌ వెళ్తున్న మహీంద్రా థార్‌ కారు ఢీ కొట్టింది. బాధితునికి తలతో పాటు వెనక వైపు తీవ్రంగా గాయాలు తగిలి రక్తం కారుతుండటంతో సమీపంలోని నీలిమ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

పోచారం: అన్నోజిగూడలో జాతీయ రహదారిపై చెట్లను నరికివేయడంతో అటవీ శాఖ అధికారులకు స్థానికుడు బద్దం శ్రీనివాస్‌ రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. నారాయణ జూనియర్‌ కళాశాల, వీడీఆర్‌ రెసిడెన్సీ సమీపంలో చెట్లను పూర్తిగా వేర్ల వరకు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ ప్రాంతం తగ్గి వర్షాభావ పరిస్థితులు సంభవించడంతో చెట్లు పెంచాలని ప్రభుత్వం పదేపదే చెప్తున్నా బాధ్యతారాహిత్యంగా చెట్లను నరికిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్‌ గృహకల్ప కాలనీలో వైఆర్‌జీ కేర్‌ స్వచ్ఛంద సంస్థ శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్‌ టి.రామిరెడ్డి, సూపర్‌వైజర్‌ యశోద, ఫీల్డ్‌ లింక్‌ వర్కర్‌ జయకిషన్‌ పాల్గొన్నారు.

సెల్లార్‌లోకి నీళ్లు రాకుండా నివారించండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌

బోడుప్పల్‌: 11వ డివిజన్‌ పరిధిలో లక్ష్మిగణపతి కాలనీలోని సెల్లార్‌లోకి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్‌ కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్‌ శుక్రవారం కమిషనర్‌ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ఫుడ్స్‌ నుంచి వస్తున్న వ్యర్థ జలాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, సుధాకర్‌, రాజు ఉన్నారు.

ట్రాఫిక్‌ నియంత్రణపై విద్యార్థులకు శిక్షణ

ఉప్పల్‌: ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌, ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో అధికారులు ట్రాఫిక్‌ నియంత్రణ పై శిక్షణ ఇచ్చారు. ట్రాఫిక్‌ నియంత్రణలో విద్యార్థుల సేవలను వినియోగించుకునేందుకు పోలీస్‌ శాఖ శ్రద్ధ చూపిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ అధికారులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌ హెచ్‌సీ వేణుగోపాల్‌, కానిస్టేబుల్‌ లక్ష్మీ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్‌ జయంతి రెడ్డి, ఫ్యాకల్టీ ఎం ప్రశాంత్‌, నవీన్‌ కుమార్‌ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని అక్రమ లేఔట్‌ బాధితుల వినతి





వివరాలు సేకరిస్తున్న ఎంపీవో నందకిషోర్‌, అక్రమ లేఔట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

- ఆనందర్‌నగర్‌కాలనీలో పర్యటించిన అధికారులు
- రికార్డులు, అక్రమ లేఔట్‌ పరిశీలన

కీసర: తమ పిల్లలు, కుటుంబ సభ్యుల భవిష్యత్తు అవసరాల కోసం రూపాయిరూపాయి కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను కొందరు వ్యక్తులు ఆక్రమించి కొత్తగా లేఔట్‌ చేసి ఇతరులకు విక్రయించారంటూ శుక్రవారం కీసరలోని ఆనంద్‌నగర్‌ కాలనీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 368 నుంచి 395 వరకు దాదాపు వందల ఎకరాల్లో నలభై ఏళ్ల క్రితం ఆనంద్‌నగర్‌ పేరిట లేఔట్‌ చేసి ప్లాట్లు విక్రయించారన్నారు. అప్పట్లో వివిధ ప్రాంతాలకు చెందిన వారు ప్లాట్లు కొనుగోలు చేశారని తర్వాత ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎవరూ రాకపోవడంతో హద్దురాళ్లు తొలగించి ఇతరులకు అదే స్థలాన్ని విక్రయించారన్నారు. కొత్తగా లేఔట్‌ చేసి ఇతరులకు విక్రయించి ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టారని, ప్లాట్లు కోల్పోయిన బాధితులు పలుమార్లు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీంతో తాము (బాధితులు)తమకు జరిగిన అన్యాయంపై ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్‌, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పంచాయతీ అధికారి నందకిషోర్‌, పంచాయతీ కార్యదర్శి గంగన్న విచారణ నిర్వహించారు. బాధితులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను అధికారులకు చూపించారు. అనంతరం అధికారులు బాధితులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. పూర్తి విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపీవో నందకిషోర్‌ తెలిపారు.

కుక్కల బెడదపై టోల్‌ ఫ్రీ నెంబర్‌ ఏర్పాటు

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలో కుక్కల బెడదపై టోల్‌ ఫ్రీ నెంబర్‌ను ప్రారంభించినట్లు కమిషనర్‌ తాజ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కుక్కల బెడద నుంచిప్రజలు తమను రక్షించుకోవాలని వివరించారు. ప్రతి డివిజన్‌లో కుక్కలను పట్టుకుంటారని, ఫిర్యాదు చేయాలనుకునే వారు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ కృష్ణప్పను ఫోన్‌: 80740 64746, ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్‌ సందీప్‌ను ఫోన్‌: 99639 96908లో సంప్రదించాలని తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని పెట్టాలి

కీసర: ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్‌ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను ఆయన పరిశీలించారు. చైర్మన్‌ మాట్లాడుతూ... విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం భోజనం అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.

అసంపూర్తి బ్రిడ్జితో నిత్యం ఇబ్బందులే...



రైల్వే స్టేషన్‌ సమీపంలో బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ

మేడ్చల్‌: మేడ్చల్‌–గిర్మాపూర్‌ రోడ్డులో రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద చేపట్టిన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయ దారిగా ఉన్న రైల్వే స్టేషన్‌ సమీపంలోని అండర్‌పాస్‌ బ్రిడ్జిగుండా వాహనదారులు నిత్యం ప్రయాణించలేక నానా అవస్థలు పడుతున్నారు. రైల్వే ట్రాక్‌ అవతల పదుల సంఖ్యలో కాలనీలు ఉండటం, గిర్మాపూర్‌ రోడ్డులో పలు గ్రామాలు ఉండటంతో ఏళ్లుగా రామలింగేశ్వర ఆలయ సమీపంలో గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారు. దీంతో ఆ రోడ్డు పూర్తిగా మూసివేశారు. కాలనీలకు, గ్రామాలకు వెళ్లే వారు రైల్వే స్టేషన్‌, జూనియర్‌ కళాశాల మధ్య వర్షపు నీరు ట్రాక్‌ కింద నుంచి వెళ్లే విధంగా అండర్‌ బ్రిడ్జి గతంలో నిర్మించారు. తాజాగా ఆ బ్రిడ్జి నుంచి వెళ్లే దారే చాలా కాలనీలకు ప్రధాన రోడ్డుగా మారింది. అందులోనే మంచినీటి పైప్‌లైన్‌ ఉండటంతో అసలే చిన్నగా ఉన్న బ్రిడ్జి మరింత ఇరుకుగా మారింది. ఓ వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నిత్యం ట్రాఫిక్‌ జాం అవుతుండటంతో ఆ దారిలో వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం బ్రిడ్జి వద్ద ఓ ట్రాక్టర్‌ మ్యాన్‌హోల్‌ ఇరుక్కుపోవడంతో గంటల తరబడి వాహనల రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం ఏదోఒక ఆటంకం ఏర్పడుతుంటడంతో ట్రాక్‌ అవతలికి వెళ్లాలంటే ప్రయాణం నరకప్రాయంగా మారింది.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



ఎర్రోళ్ల సంతోష్‌ (ఫైల్‌)

మేడ్చల్‌రూరల్‌: చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి గల్లంతైన ఘటన శుక్రవారం మేడ్చల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధి పూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివీ... పూడూరు గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సంతోష్‌(29), మరో వ్యక్తి మేకల నరేష్‌ ఇద్దరూ కలసి గ్రామ పరిధిలోని వాగులో మధ్యాహ్నం చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సంతోష్‌ ప్రమాదవశాత్తు వాగులో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

ఇన్‌స్పెక్టర్‌ కృషితో నిందితుడికి శిక్ష

ఉన్నతాధికారుల అభినందనలు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగిన చిన్న పాప కిడ్నాప్‌ ఘటన గత ఏడాది జులైలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ రోజు అమ్మాయిని 24 గంటల్లోనే పోలీసులు కాపాడారు. అదేవిధంగా నేరస్తుడికి శిక్ష పడే విధంగా కృషి చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించి విజయం సాధించారు. గురువారం కుషాయిగూడ పోక్సో కోర్టు నిందితుడికి పదేళ్ల కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. కేసు దర్యాప్తులో కీలక భూమిక వహించిన అప్పటి ఘట్‌కేసర్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేందర్‌రెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దాం



విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

మేడ్చల్‌: వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఇళ్లు, దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మేడ్చల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. దుకాణాల వద్ద, ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయించారు. పాత వస్తువులలో, చెట్ల కుండీలలో, ఇళ్ల ముందు చిన్న చిన్న గుంతలలో వర్షం నీరు నిల్వుండకుండా శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాంచందర్‌ తదితరులు న్నారు.

కీసర: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దామని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలో ఫ్రైడే డ్రైలో భాగంగా నాగారం ప్రధాన చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో ఉన్న నాలాను పరిశీలించారు. వర్షాకాలంలో దోమలు, ఈగల బెడద తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మురుగునీరు, కుంటల్లో దోమలు, ఈగలు వృద్ధిని తగ్గించేందుకు ఆయిల్‌బాల్స్‌, తెమోఫాస్‌ స్ప్రే చేయిస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు మున్సిపల్‌ పరిధిలోని వివిధ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలంతా ఫ్రైడే గంటసేపు తమ ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పనులు చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడటం, మంచినీరు నిల్వ ఉండే కూలర్లు, నీటి తొట్టెలు, పాతటైర్లు, నీరు నిల్వచేసే డ్రమ్ములను ఖాళీచేసి వాటిని పొడిగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు, పాతటైర్లు, డబ్బాలు, పాత్రలు ఇంటి పరిసరాల్లోకి వచ్చే చెత్తబండికి అందజేయాలన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో డ్రై డే

ఘట్‌కేసర్‌: పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చైర్‌పర్సన్‌ ముల్లి పావని జంగయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాలలు, నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు రహీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో...

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీపీసీ చౌరస్తా వద్ద ఉన్న పబ్లిక్‌ టాయ్‌లెట్లను చైర్మన్‌ కొండల్‌రెడ్డి పరిశీలించారు. నారపల్లిలో దోమల నివారణ కోసం చెరువులో ఆయిల్‌ బాల్స్‌ వేశారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్‌ వేమనరెడ్డి, కౌన్సిలర్లు సుర్వి సుధాలక్ష్మి, మోటుపల్లి పోచమ్మ, కో ఆప్షన్‌ సభ్యుడు అక్రమ్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.



టైర్లలో నిలువ ఉన్న వర్షం నీటిని శుభ్రం చేయిస్తున్న కమిషనర్‌ నాగిరెడ్డి



మొక్కలు నాటుతున్న చైర్‌ పర్సన్‌ ముల్లి పావని

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

అల్వాల్‌: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్‌ మహాసభ మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, మల్కాజిగిరి మండల అధ్యక్షుడు చెరుకు సాంబరాజ్‌ ముదిరాజ్‌ అన్నారు. ముదిరాజ్‌ కులస్తులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మల్కాజిగిరి మండల తహసీల్దార్‌ సీతారాంకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముదిరాజ్‌ కులస్తులను బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మార్చాలన్నారు. చెరువు, కుంటలు, మత్స్య సంపదపై ముదిరాజ్‌, గంగపుత్ర, గూండ్ల కులాలకు హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలని, 75శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు చేపట్టాలన్నారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, ఈ బోర్డుకు ముదిరాజ్‌ కులస్తులనే చైర్మన్‌గా నియమించాలన్నారు. రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం పెంచడానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మల్కాజిగిరి మండల ఉపాధ్యక్షులు గద్వాల వంశీ, ప్రధాన కార్యదర్శి బొల్లు సంపత్‌, కోశాధికారి దండు ప్రసాద్‌, ఉపాధ్యక్షులు కటికల బిక్షపతి, ఊదారి కృష్ణమూర్తి, ప్రచార కార్యదర్శి ఆంజనేయులు, మహేష్‌, రమేష్‌, సురేష్‌, రమేష్‌, పరుశురామ్‌, మల్లేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులను పూర్తి చేయండి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌లో పలు కాలనీల్లో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పటేల్‌ స్థానిక కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు బస్తీల్లో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. కొండన్య భవన్‌లో పెండింగ్‌ పనులపై ఆరా తీశారు. దోభీఘాట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. థీమ్‌ పార్క్‌లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పలు అభివృద్ధి పనులు నిధులు మంజూరు చేయాలని జోనల్‌ కమిషనర్‌కు కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాప్రా ఇప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి, ఈఈ హరిలాల్‌, డీఈ రవీందర్‌, ఏఈ స్రవంతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.